E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

25-3-2025 మంగళవారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



2లో

**'గ్రూప్1' పేపర్లు రీవాల్యుయేషన్ జరిపించాలి..**
**తెలంగాణ హైకోర్టులో అభ్యర్థుల పిటిషన్**



# మంత్రివర్గ విస్తరణకు కసరత్తు

**ఢిల్లీలో అధిష్ఠానంతో సీఎం రేవంత్‌డ్డి చర్చలు**

- రాహుల్,ఖర్గే, కేసీ వేణుగోపాల్తో ముఖ్యమంత్రి కీలక సమావేశం హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- తెలంగాణలో తాజా పరిస్థితులపై అమలవుతున్న కార్యక్రమాలపైనా ఢిల్లీ పెద్దలకు వివరించిన సీఎం కేబినెట్ విస్తరణపై అధిష్టానం కీలక నిర్ణయం?

**ఈ-కబురు హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు ముఖ్యనేతలు ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఈ రోజు (సోమవారం) మధ్యాహ్న సమయంలో సీఎం రేవంత్ తో పాటు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఢిల్లీకి పయనమయ్యారు.. తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్ విస్తరణ, భారత్ సంవిధాన్ కార్యక్రమాలకు సంబంధించి సీఎం రేవంత్, పలువురు మంత్రులను ఢిల్లీకి బయల్దేరి రమ్మని అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఈరోజు (సోమవారం) సాయంత్రం 6 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో వీరు సమావేశం కానున్నారు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఢిల్లీకి బయల్దేరి వెళ్లినట్లు తెలుస్తోంది.

వచ్చే నెలలో సీఎం రేవంత్ విదేశీ పర్యటనఏప్రిల్ లో సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటించనున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి 23 వరకూ జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు సీఎం రేవంత్. అయితే ఈ లోపే డీ లిమిటేషన్ పై హైదరాబాద్ 2లో

# తమ హోదాకు తక్కువైనా...
# చైన్ మెన్లుగా కొనసాగేందుకే ఆసక్తి

**అక్రమ వసూళ్ల కోసమేనని ఆరోపణలు**

- చందానగర్ సర్కిల్ లో చైన్ మెన్లుగా మారిన రికార్డు అసిస్టెంట్లు
- ఉన్నతాధికారుల అండతో చెలరేగిపోతున్న అనధికార చైన్ మెన్లు
- కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరతపై అనుమానాలు



చందానగర్ సర్కిల్ కార్యాలయం




సర్కిల్ పరిధిలోని మాదాపూర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** ఏ ప్రభుత్వ కార్యాలయమైనా... ప్రైవేటు సంస్థ ఐనా... తమ హోదాకు తక్కువ స్థాయి ఉద్యోగం చేయమంటే ఏ ఉద్యోగి ఒప్పుకోడు. కానీ జిహెచ్ఎంసి చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ హోదా కంటే తక్కువ స్థాయి ఉద్యోగం చేసేందుకు పోటీ పడుతున్నారు. సర్కిల్ కార్యాలయంలో సదరు ఉద్యోగులు జాయిన్ అయింది... ప్రతినెల జీతం తీసుకుంటుంది... ఒక పోస్టులో అయితే, పనిచేస్తుంది మాత్రం మరో పోస్టులో. అది కూడా తమ హోదాలో, వేతనంలో తక్కువగా ఉండే విధుల్లో. ఈ ఉద్యోగులు ఉన్నతాధికారుల ఆదేశాలతో అయిష్టంగా పనిచేస్తున్నారా అంటే అది కాదు... తమ హోదాకు తక్కువైనా, ఈ పనిచేసేందుకు ఈ కార్యాలయంలో ఉద్యోగులు పోటీ పడుతున్నారు. జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరిన ఉద్యోగులు టౌన్ ప్లానింగ్ చైన్ మెన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. తమకు సంబంధం, అనుభవం లేని పోస్టుల్లో కొనసాగేందుకు ఇక్కడి ఉద్యోగులు అత్యంత ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం అక్రమ నిర్మాణాల వద్ద ముట్టే అక్రమ సంపాదన మీద అశే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత పేరుతో ఉన్నతాధికారులే తమకు అనుకూలంగా ఉండే రికార్డు అసిస్టెంట్లను చైన్ మేన్లుగా అనధికారంగా కొనసాగిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అధికారులు తమకు నచ్చిన ఉద్యోగులను చైన్ మెన్లుగా విధుల్లో కొనసాగిస్తూ అక్రమ నిర్మాణదారులకు వంతపాడుతున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఈ ఉద్యోగులు తమ జేబులు నింపుకోవడంతో పాటు ఉన్నతాధికారులకు వాటాలు ముట్టజెప్పుతున్నారని, అందుకోసమే చైన్ మెన్లు కాని వారిని అనధికారికంగా సర్కిల్ పరిధిలో కొనసాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.

**చందానగర్ సర్కిల్ లో...**

శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని నాలుగు సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను 2024 అక్టోబర్ 21వ తేదిన జోనల్ కమిషనర్ తరువాయి 2లో



2లో

**పీ4 విధానం.. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం**



6లో

**ఐపీఎల్ హిస్టరీలోనే కాస్ట్‌లీ ప్లేయర్.. కట్ చేస్తే! తొలి మ్యాచ్‌లోనే డకౌట్**

## విద్యార్థి వీసాలకు అమెరికా కత్తెర..
## 41శాతం దరఖాస్తుల తిరస్కరణ

**విద్యార్థి వీసాలను అమెరికా భారీ స్థాయిలో తిరస్కరిస్తోంది. 2023-24లో 41శాతం దరఖాస్తులను అగ్రరాజ్యం ఆమోదించలేదు.**




**ఈ కబురు:** విదేశాల్లో పైచదువులు చదవాలన్నది చాలామంది కల. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ ఇష్టపడుతుంటారు. అలా చాలా దేశాల నుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు అగ్రరాజ్యానికి వెళ్తుంటారు. అయితే, గత కొంతకాలంగా ఈ విద్యార్థి వీసాల సంఖ్యకు అమెరికా సర్కారు భారీగా కత్తెర వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది. దశాబ్దం క్రితంతో పోలిస్తే F1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 202324 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు.

అంతకుముందు 202223 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల తరువాయి 2లో

**జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం..**

## కొలీజియం కీలక నిర్ణయం



2లో

## 11,298 ఎకరాల్లో పంట నష్టం..
## ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక: తుమ్మల

**వడగళ్ల వానలతో పంట నష్టంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. మార్చి 21 నుంచి 23 వరకు వడగళ్ల వానలతో పంట నష్టం సంభవించింది.**



**ఈ కబురు [హైదరాబాద్]:** ఈ ఏడాది మార్చి 21 నుంచి 23 వరకు వడగళ్ల వానలతో పంట నష్టం సంభవించింది. పంట నష్టంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక 3లో

## రాహుల్ గాంధీ పౌరసత్వంపై
## కేంద్రానికి 4 వారాల గడువు

**రాహుల్ గాంధీ పౌరసత్వంపై తేల్చే అంశంపై కేంద్రానికి అలహాబాద్ హైకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది.**



**లఖ్‌నవూ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంలో కేంద్రానికి అలహాబాద్ హైకోర్టు గడువు నిర్దేశించింది. నాలుగు వారాల్లో పౌరసత్వం అంశం తేల్చాలని సూచించింది. న్యాయస్థానానికి 8 వారాల గడువు కోరగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ తదుపరి విచారణను లఖ్‌నవూ బెంచ్ ఏప్రిల్ 21కి వాయిదా వేసింది. ఆ లోగా స్టేటస్ రిపోర్ట్‌ను కేంద్రం కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.

**పార్లమెంటు సభ్యుల వేతనాలు పెంపు**

రాహుల్ గాంధీ పౌరసత్వం అంశం కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే 2లో

## అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

**స్పీకర్‌కు లేఖను అందజేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**

**తన సస్పెన్షన్‌పై బులెటిన్ ఇవ్వాలని స్పీకర్‌కు వినతిపత్రం**

**కోర్టుకు పోతాననే భయంతోనే బులెటిన్ ఇవ్వడం లేదన్న ఎమ్మెల్యే**



**ఈ-కబురు, హైదరాబాద్:** బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనకుండా తనపై విధించిన సస్పెన్షన్‌కు సంబంధించిన అధికారిక బులెటిన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సోమవారం స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జగదీశ్‌రెడ్డి కలిశారు. తనను అన్యాయంగా, ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ఇప్పటికైనా తన సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయడంతోపాటు అసెంబ్లీ వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పీకర్‌కు అందజేసిన లేఖలో జగదీశ్‌రెడ్డి కోరారు.

కాగా అసెంబ్లీ లాబీలోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష చాంబర్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డిని సభ ఆవరణ నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కరుణాకర్ కోరారు. తనను సస్పెన్షన్ చేసినట్టు బులెటిన్ చూపిస్తే బయటకు వెళతానని 2లో

ఈ-కబురు
25- 3-2025
మంగళవారం
e kaburu.com

## జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం..
# కొలీజియం కీలక నిర్ణయం



**నోట్లకట్టల ఆరోపణల వేళ జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో సుప్రీం కొలిజియం కీలక సిఫారసులు చేసింది.**

**ఈ కబురు ,దిల్లీ:** దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది. దీనిపై కేంద్రం ఆమోదం లభించాక తుది ప్రకటన వెలువడనుంది.

న్యాయమూర్తి అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చినట్లు వార్తలు రావడంతో సుప్రీంకోర్టు కొలీజియం ఈ అంశంపై అత్యవసరంగా విచారణ ప్రారంభించింది. జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఇదివరకే పేర్కొంది. అయితే ఆ నిర్ణయంపై కొలిజియంలోని కొందరు సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇదిలా ఉంటే.. ఈ రోజు దిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ కీలక ప్రకటన చేసింది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అది అమల్లో ఉంటుందని తెలిపింది. కానీ ఇంతలోనే కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది.

జస్టిస్ వర్మ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. దిల్లీ హైకోర్టు సీజేకు ఇచ్చిన సమాధానంలో ఆయన ఈమేరకు స్పష్టం చేశారు. తాను గానీ, తన బంధువులు గానీ ఎటువంటి నోట్ల కట్టలను గదిలో ఉంచలేదని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా దీనిని పేర్కొన్నారు. తమ నగదు ఉపసంహరణలు బ్యాంకుల ద్వారానే జరుగుతాయని, తాము యూపీఐ యాప్‌లను వాడతామని, కార్డులతో లావాదేవీలు జరుపుతామని వివరించారు. తాము ఆ గదిని.. సాధారణంగా ఉపయోగంలో లేని ఫర్నిచర్, సీసాలు, క్రాకరీ, పరుపులు, కార్పెట్లు, పాత స్పీకర్లు, గార్డెన్ వస్తువులను ఉంచడానికి వాడతామని తెలిపారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జు తోసిపుచ్చారు. మూడు తరాలుగా ఆయన కుటుంబం గురించి తనకు తెలుసని పేర్కొన్నారు.

# తమ హోదాకు తక్కువైనా...
# చైన్ మెన్లుగా కొనసాగేందుకే ఆసక్తి

**మొదటి పేజీ తరువాయి**

ఉపేందర్‌రెడ్డి బదిలీ చేశారు. టౌన్ ప్లానింగ్ కింది స్థాయి ఉద్యోగుల మీద అనేక విమర్శలు వెల్లువెత్తడంతో ఒక సర్కిల్ లో పని చేస్తున్న ఉద్యోగులను అదే సర్కిల్ లో ఉంచకుండా కొత్త సర్కిల్ కు బదిలీ చేశారు. గతంలో చందానగర ్సర్కిల్ లో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేసే ఉద్యోగి అనధికార చైన్ మెన్ గా పనిచేస్తూ, అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు రావడంతో, సదరు ఉద్యోగిని ఈ సర్కిల్ నుంచి బదిలీ చేశారు. అదే సమయంలో శేరిలింగంపల్లి సర్కిల్‌లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ జావీద్, పటాన్ చెరు సర్కిల్‌లో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ రాజేందర్‌లు చందానగర్ సర్కిల్ కు బదిలీపై వచ్చారు. చందానగర ్సర్కిల్ లో ఈ ఇద్దరు ఉద్యోగులు వాస్తవానికి తమకు కేటాయించిన విభాగంలో రికార్డులను పరిశీలిస్తూ, అధికారుల ఆదేశానుసారం వారికి కావల్సిన రికార్డులను అందజేస్తూ అఫీస్‌లోనే అందుబాటులో ఉండాలి. కానీ వారు ఆ పోస్టుల్లో పనిచేయకుండా రికార్డు అసిస్టెంట్ కన్నా కింది స్థాయి పోస్టు అయినా చైన్‌మెన్ పోస్టులో విధులు నిర్వహిస్తున్నారు. కానీ జీతం మాత్రం రికార్డు అసిస్టెంట్ పోస్టు కిందే తీసుకుంటున్నారు. చివరికి వీరు రోజు సంతకం చేసే హాజరు రిజిస్టర్ లో సైతం రికార్డు అసిస్టెంట్లు గానే కొనసాగుతున్నారు.

### అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లు.. ?

టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్ మెన్ల విధులు అత్యంత కీలకమైనవి. సర్కిల్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అక్రమ నిర్మాణాలు కొనసాగకుండా అడ్డుకోవడంతో పాటు నిర్మాణ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తుల పరిశీలన ఫీల్డ్ లో చేయల్సి ఉంటుంది. సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల మీద ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయడంతో పాటు అనుమతి లేని నిర్మాణాలు కొనసాగకుండా అడ్డుకోవాలి. కానీ తమది కాని విధుల్లో కొనసాగుతున్న చందానగర్ సర్కిల్ చైన్ మెన్లు అక్రమ నిర్మాణదారుల వద్ద వసూళ్లే
ధ్యేయంగా పనిచేస్తున్నారు. సర్కిల్ పరిధిలో ఏ ప్రాంతంలో చూసినా వందలకొద్దీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండగా, అడ్డుకోవలసిన సిబ్బంది సదరు నిర్మాణదారులు ముట్టజెప్పే డబ్బుకు ఆశపడి అక్రమ నిర్మాణాలను వదిలేస్తున్నారు. దీంతో జిహెచ్ఎంసి అనుమతి లేకుండా చందానగర్ సర్కిల్ పరిధిలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇక అయ్యప్ప సొసైటీ ప్రాంత చైన్ మెన్ కోసం హై డిమాండ్ ఉండగా, గత ఆరు నెలల్లో మూడు పర్యాయాలు చైన్ మెన్ల మార్పు చేపట్టడం గమనార్హం. కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్ మెన్ల కొరత బూచి చూపించి.. అధికారులే తమకు నచ్చిన ఉద్యోగులను ఫీల్డ్ మీద తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అక్రమ నిర్మాణాల వద్ద సర్కిల్ రికార్డు అసిస్టెంట్



## రాహుల్ గాంధీ పౌరసత్వంపై
# కేంద్రానికి 4 వారాల గడువు

**మొదటి పేజీ తరువాయి**

ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ వేసిన పిటిషన్లపై న్యాయస్థానం తాజా ఆదేశాలు ఇచ్చింది. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి లేఖ రాశారు. తన వద్ద రాహుల్‌గాంధీ పౌరసత్వానికి సంబంధించిన యూకే ప్రభుత్వం సమర్పించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు.

# మంత్రివర్గ విస్తరణకు కసరత్తు



**మొదటి పేజీ తరువాయి**

లో మీటింగ్ నిర్వహించే యోచనలో ఉన్నారు రేవంత్.
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కోర్ కమిటీ సభ్యులకు అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో ముఖ్యమంత్రి సహా పలువురు నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోర్ కమిటీ నేతలు కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశం కానున్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారని సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సహాయక చర్యలను వేగంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రత్యేకించి, సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణ కోసం సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎస్‌ను (చీఫ్ సెక్రటరీ) ఆదేశించారు.ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి, సహాయక చర్యలపై తాజా సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన సహాయక చర్యల పురోగతిని అధికారులు సీఎం ముందు వివరించారు. రాష్ట్రంలో సహాయ చర్యలు నిరంతరంగా కొనసాగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. సహాయక చర్యలను సమర్థంగా సమన్వయం చేయడం, ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని చీఫ్ సెక్రటరీ (CS) ను సీఎం రేవంత్ ఆదేశించారు. దీనివల్ల సహాయ చర్యలు మరింత సత్వరంగా జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సహాయక చర్యలకు సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు త్వరగా తీసుకోవాలని సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సహాయక చర్యలు మరింత సమర్థంగా అమలయ్యేలా కేంద్రంతో సమన్వయం చేసుకోవడం కీలకం అని ఆయన అభిప్రాయపడ్డారు. సహాయక చర్యలను మరింత మెరుగ్గా అమలు చేయడానికి ఎక్స్పర్ట్ కమిటీ సూచనలను అనుసరించాలని సీఎం సూచించారు. రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని అధికారులను సీఎం ఆదేశించారు.సహాయక చర్యల్లో ఏ మాత్రం అలసత్వం లేకుండా బాధితులను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం పెంచుకుని, సహాయక చర్యలను వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తున్నదని, ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే సహాయ చర్యలు అందుబాటులోకి తేవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## పీ-4 విధానం.. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం



**సంపన్నులు-పేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రూపొందించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.**

**అమరావతి:** సంపన్నులుపేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ4 విధానాన్ని రూపొందించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అ విధానంలో భాగస్వాములు కావడానికి ఎన్నారైలతో సహా ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చన్నారు. ఈ విధానం అమలు ప్రక్రియలో అండగా నిలిచేవారిని మార్గదర్శిగా, లబ్ధిపొందే కుటుంబాలను బంగారు కుటుంబాలుగా వ్యవహరిస్తామన్నారు. పీ4 విధానంపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ విధానం అమలు తీరుపై సీఎం స్పష్టత ఇచ్చారు.

పీ4 అమల్లో భాగంగా.. తొలుత గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిపొందే కుటుంబాల జాబితా రూపొందిస్తారు. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని సీఎం తెలిపారు. 2029 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలనేదే సంకల్పంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఉగాది పండుగ రోజు అమరావతిలో పీ4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పథకాలకూ ఎలాంటి సంబంధం లేదని చంద్రబాబు తెలిపారు.

## విద్యార్థి వీసాలకు అమెరికా కత్తెర..
# 41శాతం దరఖాస్తుల తిరస్కరణ




**మొదటి పేజీ తరువాయి**

దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు.

201314 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది.
అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాలు 38శాతం తగ్గినట్లు తెలిసింది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి.

బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.


**ఏంటీ ఎఫ్-1 వీసా?**

ఎఫ్1 వీసా అనేది నాన్‌ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. అగ్రరాజ్యంలోని విద్యా సంస్థలు ఏటా రెండు సార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

## ‘గ్రూప్1’ పేపర్లు రీవాల్యుయేషన్ జరిపించాలి..
# తెలంగాణ హైకోర్టులో అభ్యర్థుల పిటిషన్

**తెలంగాణలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.**

**ఈ కబురు [హైదరాబాద్]:** తెలంగాణలో నిర్వహించిన గ్రూప్1 పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని గ్రూప్1 అభ్యర్థులు హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. “18 రకాల సబ్జెక్టులుంటే 12 సబ్జెక్టుల నిపుణులతోనే పేపర్లను దిద్దించారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో తెలుగు, ఇంగ్లీష్ మీడియం పేపర్లు మూల్యాంకనం చేయించారు. అలా చేయడం వల్ల మూల్యాంకనంలో నాణ్యత లోపించింది. తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగింది” అని పిటిషనర్లు పేర్కొన్నారు.



పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీ ని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం నాలుగు వారాలకు వాయిదా వేసింది.



# అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

జగదీశ్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. తాను అసెంబ్లీకి రావడంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటలకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలోనే జగదీశ్‌రెడ్డి గడిపారు.



## భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంపు

**ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన ఉందని.. అయితే గడువు పొడిగించే ఆలోచన ఇప్పటికైతే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.**

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ (LRS)కి ఆశించిన స్పందన ఉందని.. అయితే గడువు పొడిగించాలనే ఆలోచన ఇప్పటివరకూ లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం డబ్బులు చెల్లించిన ప్రతి ఒక్కరికీ తగిన పరిశీలన అనంతరం ప్రొసీడింగ్స్ ఇస్తామన్నారు. గతంలో 10 శాతం రిజిస్ట్రేషన్ అయిన లేఅవుట్లలో.. మిగిలిన 90 శాతం ప్లాట్స్‌కు కూడా ఇప్పుడు ఎల్ఆర్ఎస్ చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీ ఆవరణలో పొంగులేటి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

భూభారతి అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయని పొంగులేటి వెల్లడించారు. రెవెన్యూ సర్వే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని.. దాదాపు వెయ్యిమంది సర్వేయర్లను నియమిస్తామని చెప్పారు. స్లాట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ఆధార్‌తో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. అయితే, గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 12 లక్షల సాదాబైనామీలను మాత్రమే భూభారతి వచ్చిన తర్వాత పరిష్కరిస్తామన్నారు.



## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికుల మృతదేహాలను వీలైనంత త్వరగా వెలికితీసేలా చూడాలన్నారు. తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత చర్యలపైనా దృష్టి పెట్టాలని.. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకెళ్లాలని సీఎం సూచించారు. అవసరమైతే ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐతో అధ్యయనం చేయించాలని అధికారులకు చెప్పారు.

సొరంగం నుంచి కార్మికుల మృతదేహాలను వెలికితీసే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానాన్ని ఉపయోగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంలో ఉన్నత స్థాయి కమిటీ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లనుంది. కేంద్ర హోంశాఖ మార్గదర్శకాల ప్రకారం.. గల్లంతైన ఏడుగురు బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.



## తితిదే ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు: ఛైర్మన్ బీఆర్ నాయుడు

**టీటీడీలోని శాశ్వత ఉద్యోగులకు 3 నెలలకు ఒకసారి సుపథం దర్శనం కల్పిస్తామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు.**

**తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) శాశ్వత ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి సుపథం దర్శనం కల్పిస్తామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సుపథం టికెట్ ఇచ్చి శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. తిరుమలలో లైసెన్స్ లేని దుకాణాలను ఖాళీ చేయిస్తామని తెలిపారు. తితిదే ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఈవో శ్యామలరావుతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. బోర్డు తీర్మానాలను వివరించారు.

**బోర్డు చేసిన తీర్మానాలు ఇవీ..**

ఇతర దేశాల్లో ఆలయాల నిర్మాణాల కోసం ప్రత్యేక ట్రస్టి తిదే ఆస్తులు పరిరక్షించేందుకు కమిటీ ఏర్పాటు తితిదేకు చెందిన భూముల న్యాయపరమైన వివాదాలపై పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తితిదేలో విధులు నిర్వహిస్తున్న హిందూయేతర ఉద్యోగుల తొలగింపుపై తీర్మానం. వచ్చే ఏడాది కాలంలో వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక చర్యలు

గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయంశ్రీనివాస సేవా సమితి పేరుతో స్వామి వారికి కైంకర్యాల సామగ్రి సరఫరాలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం

తితిదే మూలాలున్న వివిధ ప్రాంతాల్లోని ఆలయాల పునరుద్ధరణకు తీర్మానంతిరుమలలో అనధికార హాకర్ల తొలగింపునకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో కమిటీవృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు కేటాయింపు. ప్రయోగాత్మకంగా పూర్వ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయంరూ.5,258.68 కోట్లతో తితిదే 202526 బడ్జెట్‌కు ఆమోదంరూ.772 కోట్లతో గదుల ఆధునికీకరణకు నిర్ణయం

# గాజాలో ఆగని మృత్యుఘోష

## 50 వేలు దాటిన మరణాలు

**గాజాలో మరణ మృదంగం మోగుతూనే ఉంది. శనివారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.**

**దేర్ అల్-బలాహ్:** గాజాలో మరణ మృదంగం మోగుతూనే ఉంది. శనివారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50,021 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. 1.13 లక్షల మంది గాయపడినట్లు తెలిపింది. 2023 అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఖాన్ యూనిస్ నగరంపై ఆదివారం ఇజ్రాయెల్ నిర్వహించిన దాడిలో హమాస్ కీలక నేత సలాహ్ అల్ బర్దావీల్ (66) మృతి చెందారు. ఆయన భార్య కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్ శరణార్థి శిబిరంలో జన్మించిన బర్దావీల్.. హమాస్ సీనియర్ నేత యాహ్యా సిన్వర్‌కు సన్నిహితుడు. హమాస్ రాజకీయ విభాగానికి నాయకుడు కూడా. ఇజ్రాయెల్ దాడుల్లో సిన్వర్, ముస్తాహాలు చనిపోయినప్పటి నుంచి బర్దావీలే హమాస్‌లో కీలకనేతగా వ్యవహరిస్తున్నారు.



గాజా నుంచి పాలస్తీనియన్లను తరలించేందుకు కొత్త డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దీనికి ఆ దేశ మంత్రిమండలి శనివారం ఆమోదం తెలిపింది. గాజా నుంచి పాలస్తీనియన్లు జోర్డాన్, ఈజిప్టు తదితర దేశాలకు శాశ్వతంగా తరలివెళ్లాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్.. ఇందుకోసం ఒక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గమనార్హం.



## 11,298 ఎకరాల్లో పంట నష్టం.. ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక: తుమ్మల

**మొదటి పేజీ తరువాయి**

అందింది. దీనికి సంబంధించి తుది నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశామని ఆయన తెలిపారు. 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందన్నారు. 309 ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి నివేదిక వచ్చాక పరిహారం చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు.

## గచ్చిబౌలి ఘరానా మోసం నిందితుడి కోసం గాలింపు ముమ్మరం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** బంగారం బిస్కెట్లు, డాలర్లతో వ్యాపారులను మోసగించి ఉడాయించిన నింధితుడి కోసం గచ్చిబౌలి పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని డిఎల్ఎఫ్ సమీపంలో ఓ హోటల్ లో నగర వ్యాపారులను కలిసిన నిందితుడు వారికి మాయమాటలు చెప్పి 500 గ్రాముల బంగారు బిస్కెట్లు, 18వేల అమెరికన్ డాలర్లతో ఉడాయించిన విషయం తెలిసిందే. వ్యాపారుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కాగా కారు అద్దెకు తీసుకున్న సమయంలో నిందితుడు ఇచ్చిన ఆధార్ కార్డు ఆధారంగా నిందితుడిని స్టీవ్ గాడ్విన్ గా పోలీసులు గుర్తించగా, విచారణలో నిందితుడు ఇచ్చిన ఆధార్ కార్డు నకిలీదని తేలింది. పోలీసులకు నిందితుడి ఫోటో లభించగా, గచ్చిబౌలి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో గాలిస్తున్నారు. కాగా పోలీసులు ఈ మేరకు నిందితుడికి సంబంధించిన పలు వివరాలను సేకరించినట్లు తెలుస్తుంది.

## బెట్టింగ్ యాప్‌ల కేసు.. విచారణకు హాజరైన శ్యామల



**బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో వైకాపా అధికార ప్రతినిధి శ్యామల పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.**

**హైదరాబాద్:** బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో వైకాపా అధికార ప్రతినిధి శ్యామల పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని ఇటీవల ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈక్రమంలో ఆమెను అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణకు సహకరించాలని శ్యామలకు సూచించింది. ఇదే కేసులో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరిని పంజాగుట్ట పోలీసులు విచారించారు.

శ్యామలను పోలీసులు మూడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పోలీసుల విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు చెప్పారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా చనిపోయిన వారి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని చెప్పారు. బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగులు చేయడం తప్పు అని తెలిపారు. ''బెట్టింగ్ యాప్స్ అంశంపై విచారణ జరుగుతోంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై స్పందించలేను. నాకు చట్టాలపై నమ్మకం ఉంది. ఇకపై బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేయబోము'' అని శ్యామల చెప్పారు.

## హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించినట్లు స్పష్టమైంది: భారాస ఎమ్మెల్యే వివేకానంద

**జీహెచ్ఎంసీకి రూ.2,654 కోట్లు కేటాయిస్తే రూ.1,200 కోట్లే విడుదల చేశారని భారాస ఎమ్మెల్యే వివేకానంద అన్నారు.**

**హైదరాబాద్:** జీహెచ్ఎంసీకి రూ.2,654 కోట్లు కేటాయిస్తే రూ.1,200 కోట్లే విడుదల చేశారని భారాస ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్ రుణానికి రూ.2 వేల కోట్లు, అభివృద్ధి పనులకు రూ.500 కేటాయించారని చెప్పారు. ఓఆర్ఆర్ రుణం, అభివృద్ధి కోసం హెచ్ఎండీఏకు నిధులు కేటాయించినా వాటిని ఖర్చు చేయలేదని విమర్శించారు. జలమండలికి రూ.3,385 కోట్లు కేటాయిస్తే.. రుణాలకే రూ.800 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. ''రాయదుర్గం నుంచి నడిచే మెట్రో రైలు సర్వీసును రద్దు చేశారు. పాతబస్తీ నుంచి చేపట్టిన మెట్రోకు రూ.1100 కోట్లు కేటాయిస్తే రూ.300 కోట్ల కంటే తక్కువే ఇచ్చారు. మూసీ సుందరీకరణకు రూ.1500 కోట్లు కేటాయిస్తే రూ.80 కోట్లే విడుదల చేశారు. గతేడాది కేటాయించిన నిధుల్లో కేవలం 25 శాతమే విడుదల చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించినట్లు గణాంకాల ద్వారా స్పష్టమైంది.'' అని వివేకానంద విమర్శించారు

## మహిళా సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో చంద్రిక ప్రసాద్ తదితరులు

**పలు డివిజన్ల మహిళా కమిటీ సభ్యుల నియామకం**

**ఈ-కబురు,శేరిలింగంపల్లి :** మహిళా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సునీతా రావు పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత ఆదేశాల మేరకు శేర్లింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, హఫీజ్ పేట్, బి బ్లాక్ కమిటీ సభ్యుల నియామకం చేపట్టారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు రాష్ట్ర మహిళ కాంగ్రెస్ సెక్రెటరీ రమాదేవి, శేరిలింగంపల్లి జనరల్ సెక్రెటరీ భవాని, సెక్రెటరీ జ్యోతి, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి, బి బ్లాక్ ప్రెసిడెంట్ భాగ్యాలక్ష్మి, కొండాపూర్ ప్రెసిడెంట్ కావేటి లక్ష్మీ, శేరిలింగంపల్లి ప్రెసిడెంట్ తన్వీర్, మాదాపూర్ ప్రెసిడెంట్ ఉమామినంపల్లి, హఫీజ్ పెట్ ప్రెసిడెంట్ షబానాతో కలిసి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రిక ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు అధిక ప్రాధాన్యత, రక్షణ లభిస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళ సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు.

## విద్యుత్ షాక్ తో సెంట్రింగ్ కార్మికుడు మృతి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** విద్యుత్ షాక్ తో సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర పరిధిలోని ఔరత్ కు చెందిన సతీష్ లక్ష్మణ్ తెలంగ్(36) బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి హాఫీజ్ పేట్ పరిధిలో నివాసం ఉంటున్నాడు. సోదరుడు సోమనాథ్ తో కలిసి సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గచ్చిబౌలిలో ఇర్ఫాన్ అనే కాంట్రాక్టర్ వద్ద సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న సతీష్ లక్ష్మణ్ ఆదివారం మద్యాహ్నం గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న భవనం ఐదవ అంతస్థులో పనులు చేపట్టాడు. కాగా రాడ్ కటింగ్ మిషన్ పట్టుకోగా, విద్యుత్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. దీంతో స్థానికులు వెంటనే సతీష్ లక్ష్మణ్ ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు దృవీకరించారు. ఈమేరకు సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు. చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# ఒక్కరోజులో 1000 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

**దేశీయ స్టాక్‌మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 307 పాయింట్లు లాభపడి 23,658 వద్దకు చేరింది. సెన్సెక్స్ 1078 పాయింట్లు ఎగబాకి 77,984 వద్దకు చేరింది.**

సెన్సెక్స్ 30 సూచీలో ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీసీ, రియలన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ, టీసీఎస్, టాటా మోటార్స్, ఐటీసీ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎం అండ్ ఎం, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్‌లు నష్టపోయాయి.

యూఎస్ టారిఫ్ వార్తలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు లేదా అమ్మకాలతోపాటు.. డాలరు ఇండెక్స్, ముడిచమురు ధరల కదలికలపై ఈ వారం ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు. గత వారం అమ్మకాల బాట వీడి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు దిగారు. అయితే దేశీ ఫండ్స్ విక్రయాలవైపు చూపు సారించాయి. ఇటీవల ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు కొంతమేర బలహీనపడింది. ఈ నేపథ్యంలో గత వారం మార్కెట్లు జోరందుకున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. యూఎస్ మార్కెట్లు సైతం పుంజుకున్నప్పటికీ రానున్న రోజుల్లో హెచ్చుతగ్గులు ఎదురుకావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.




# తొలిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్నవారి కోసం.. 'ఛోటీ సిప్'

**తొలిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్న వారి కోసం కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (కేఎంఏఎంసీ) 'ఛోటీ సిప్'ను ప్రవేశపెట్టింది. నెలవారీగా అత్యంత తక్కువగా రూ. 250తో కూడా సిప్ రూపంలో పెట్టుబడులు పెట్టొచ్చు. దీని కింద కనీసం 60 నెలల పాటు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి దోహదపడేలా ఇది గ్రోత్ ఆప్షన్‌తో మాత్రమే లభిస్తుంది. కొత్త ఇన్వెస్టర్లలో క్రమశిక్షణతో కూడుకున్న పొదుపు అలవాటును పెంపొందించేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు.**

**ఆదిత్య బిర్లా సన్ లైఫ్‌లోనూ..**
ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ కూడా తాజాగా ఛోటీ సిప్‌ను (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ప్రారంభించింది. డెట్, సెక్టోరల్, థీమ్యాటిక్‌లాంటి కొన్ని ఫండ్స్‌కి తప్ప మిగతా అన్ని రకాల స్కీములకు ఇది అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. నెలవారీగా రూ. 250 నుంచి ఈ సిప్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు.కనీసం 60 వాయిదాలు కట్టాల్సి ఉంటుందని సంస్థ ఎండీ ఎ. బాలసుబ్రమణియన్ తెలిపారు. క్రమశిక్షణతో పెట్టుబడులు పెట్టే ధోరణిని అలవర్చుకునేందుకు ఈ విధానం తోడ్పడగలదని పేర్కొన్నారు. ఇందులో, ముందస్తుగా విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది.




# నివా బూపా పాలసీ.. టాటా ఏఐఏ అప్‌డేట్స్

**నివా బూపా 'రైజ్' హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ**
మధ్యతరగతి వర్గాల ఆదాయాలు, జీవన విధానాలకు అనుగుణంగా ఉండేలా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నివా బూపా 'రైజ్' పేరిట ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది. స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిన్న వ్యాపారాలు చేసే వారు, స్థిరంగా నెలవారీ ఆదాయం ఉండని వర్గాలకు కూడా ఉపయోగపడే విధంగా అందుబాటు ప్రీమియంలతో ఇది ఉంటుంది. ఫ్లెక్సీ-పే బెనిఫిట్ ఫీచరుతో కస్టమర్లు ముందుగా ప్రీమియంలో 20 శాతమే చెల్లించి పాలసీ తీసుకుని, మిగతా మొత్తాన్ని పాలసీ వ్యవధిలో చెల్లించవచ్చు. ఎంత త్వరగా చెల్లించేస్తే అంత ఎక్కువగా డిస్కౌంటు పొందవచ్చు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందినా స్మార్ట్ క్యాష్ బెనిఫిట్‌తో, చికిత్సానంతర వ్యయాల కోసం నిర్దిష్ట మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ప్రీమియంలో 50 శాతం మొత్తానికి సరిపడేంతగా సమ్ ఇన్సూర్డ్‌ను పెంచే రిటర్న్ బెనిఫిట్, 16 ప్రాంతీయ భాషల్లో డాక్టర్లతో డిజిటల్ కన్సల్టేషన్లు తదితర ప్రయోజనాలను కూడా దీనితో పొందవచ్చు.

**టాటా ఏఐఏ ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్**
టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా రెండు ఫండ్స్‌ను ఆవిష్కరించింది. ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్, ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇందులో మొదటిది సంపద సృష్టికి అలాగే ఆర్థిక భద్రతకు తోడ్పడుతుంది. రెండోది, రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక అవసరాల కోసం పొదుపు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు మార్చి 31తో ముగుస్తాయి. యూనిట్ ధర రూ.10గా ఉంటుంది. పెరుగుతున్న వినియోగం వల్ల లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను మదుపరులకు అందించే విధంగా ఈ ఫండ్స్ ఉంటాయి. ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ, రిటైల్..ఈ-కామర్స్, ఆటోమొబైల్స్.. ప్రీమియం ఉత్పత్తుల రంగాల సంస్థల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి.

# ఏటీఎం ఛార్జీల పెంపు.. మే 1 నుంచి..

ఏటీఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజుల పెంపునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఆర్థిక లావాదేవీలకు రూ .2, ఆర్థికేతర లావాదేవీలకు రూ .1 ఛార్జీలను పెంచింది. మే 1 నుంచి అమల్లోకి రానున్న ఈ ఛార్జీల పెంపు పరిమిత ఏటీఎం నెట్‌వర్క్ ఉన్న చిన్న బ్యాంకులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.



పెంచిన ఇంటర్‌ఛేంజ్ ఫీజులను కస్టమర్లకు బదిలీ చేయాలా వద్దా అనే దానిపై బ్యాంకులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ చివరికి భారాన్ని వినియోగదారులపైనే వేస్తారన్న చర్చ సాగుతోంది. గత పదేళ్లలో ఇంటర్ చేంజ్ ఫీజులను సవరించినప్పుడల్లా బ్యాంకులు ఆ భారాన్ని కస్టమర్లపైనే వేశాయి. ఈసారి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ ఉండదని, బ్యాంకులు కస్టమర్లకు ఫీజులు పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ఇంటర్‌చేంజ్ ఫీజు అంటే..**
ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజు అనేది ఏటీఎం సేవలను ఉపయోగించడానికి ఒక బ్యాంకు మరొక బ్యాంకుకు చెల్లించే ఛార్జీ. ఆర్బీఐ గతంలో 2021 జూన్‌లో ఇంటర్‌ఛేంజ్ ఫీజును సవరించింది. నగదు ఉపసంహరణ వంటి ఆర్థిక లావాదేవీలకు ఇంటర్ఛేంజ్ ఫీజును రూ.17 నుంచి రూ.19కి, బ్యాలెన్స్ ఎంక్వైరీలు వంటి ఆర్థికేతర లావాదేవీలకు ఇంటర్ఛేంజ్ ఫీజును రూ.6 నుంచి రూ.7కు పెంచారు.

**ఇంటర్ఛేంజ్ ఫీజుల పెంపునకు అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మార్చి 13న బ్యాంకులు, ఇతర వాటాదారులకు తెలియజేసింది. ఇంటర్ చేంజ్ ఫీజుల పెంపును అమలు చేసేందుకు ఎన్‌పీసీఐ ఆర్బీఐ అనుమతి కోరింది.**
**ప్రస్తుత ఫీజు విధానంలో కార్యకలాపాలు నడపడం ఆర్థికంగా కష్టంగా ఉన్న వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్ల విజ్ఞప్తుల మేరకు ఇంటర్ చేంజ్ ఫీజును పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మెట్రో ప్రాంతాల్లో ఒక బ్యాంకు ఖాతాదారు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు ఐదు లావాదేవీలు, నాన్ మెట్రో ప్రాంతాల్లో మూడు లావాదేవీలు ఉచితంగా చేసుకోవచ్చు.**

# రిలయన్స్ జ్యువెల్స్ పండుగ ఆఫర్లు

**రిలయన్స్ జ్యువెల్స్ తన వినియోగదారులకు పండుగ ఆఫర్లను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఉగాది, మహారాష్ట్రలో గుడిపడ్వా పర్వదినాన్ని పురస్కరించుకొని బంగారం, వజ్రాభరణాల కొనుగోలుదారుల కోసం ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది.**

ఈ ఉత్సవాలను మరింత ప్రత్యేకంగా మార్చేందుకు రిలయన్స్ జ్యువెల్స్ మార్చి 31 వరకు ప్రత్యేక పండుగ సేల్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. అందులో భాగంగా కొనుగోలుదారులు బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై 50% వరకు, వజ్రాభరణాల విలువ, వాటి తయారీ ఛార్జీలపై 35% వరకు తగ్గింపును పొందవచ్చని పేర్కొంది. నిర్దేశించిన తేదీలోపు దేశంలోని రిలయన్స్ జ్యువెల్స్ షోరూమ్‌ల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ప్రకటించింది.





మహారాష్ట్రలో గుడిపడ్వా అనేది పెద్ద పండుగ. ఈ సమయంలో చాలామంది బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారని కంపెనీ తెలిపింది. వీరికోసం ప్రత్యేక డిజైన్లలో నాథ్ (ముక్కు ఉంగరం), చంద్రకోర్ బిందీ, తుషి నెక్లెస్‌లు.. వంటివి అందిస్తున్నట్లు పేర్కొంది. అదేవిధంగా తెలుగు వారి తొలి పండుగ ఉగాదిని పురస్కరించుకొని గుట్ట పూసలు, నెక్లెస్‌లు, లక్ష్మీ నాణెం హారాలు, కాసు మాలలు..వంటివి ప్రత్యేక డిజైన్‌ల్లో రూపొందించినట్లు తెలిపింది.


# హెచ్‌ఆర్‌డీఎస్ ఇండియాతో కాల్కలస్ గ్రూప్ జట్టు

**ఏఐ ఆధారిత టూల్స్ కోసం రూ.1,000 కోట్ల ఒప్పందం**

**న్యూఢిల్లీ:** టెక్నాలజీ సొల్యూషన్లను అందించే కాల్కలస్ గ్రూప్.. ఎన్‌జీవో అయినా హెచ్‌ఆర్‌డీఎస్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఏకోసిస్టమ్ ఏర్పాటుకు వీలుగా కావాల్సిన ఏఐ ఆధారిత టూల్‌స్‌ను కాల్కలస్ గ్రూప్ అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం రూ.1,000 కోట్లతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. గ్రామీణాభివద్ధికి సంబంధించి హెచ్‌ఆర్‌డీఎస్ చేపట్టే ప్రాజెక్టుల పూర్తికి గాను టెక్నాలజీ పరమైన సహకారాన్ని కాల్కలస్ గ్రూప్ అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్‌లు, టెలికమ్యూనికేషన్ కంపెనీలకు టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను తాము అభివృద్ధి చేసి ఇస్తుంటామని కాల్కలస్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో సూరజ్ వాసుదేవన్ తెలిపారు. హెచ్‌ఆర్‌డీఎస్‌తో చేసుకున్న ఈ రూ.1,000 కోట్ల ఎంవోయూ కింద కావాల్సిన టెక్నాలజీ పరిష్కారాలను తాము అందించనున్నట్టు చెప్పారు.

# రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేసే ఫండ్..

**ఇటీవలి కాలంలో మన మార్కెట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొం టున్నాయి. ఇది చూసి దీర్ఘకాలానికి ఈక్విటీలు బ్రహ్మాండమైన రాబడులు ఇస్తాయన్న ప్రచారంలో వాస్తవం ఎంత? అన్న సందేహాలు కూడా కొందరు ఇన్వెస్టర్లలో ఏర్పడ్డాయి. ఈ సమయంలో ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలా? లేక డెట్‌లో పెట్టుబడులు పెట్టుకోవాలన్న సంశయం కూడా ఎదురుకావచ్చు. కానీ, పెట్టుబడుల ప్రయాణం చాలా సుదీర్ఘమైనది. దీర్ఘకాల లక్ష్యాల కోసం నిధిని సమకూర్చుకోవాలని కోరుకునే ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీలకు తప్పకుండా చోటు ఉండాలి. అదే సమయంలో పెట్టుబడినంతా ఈక్విటీల్లోనే పెట్టేయడం సరికాదు. డెట్‌కు సైతం కొంత కేటాయింపులు అవసరం. ఈక్విటీ, డెట్ పెట్టుబడులకు వీలు కల్పించే పథకాల్లో కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ ఒకటి.**




**రాబడులు**
గడిచిన ఏడాది కాలంలో కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి 7.30 శాతంగా ఉంది. గత ఐదు నెలలుగా మార్కెట్లు తీవ్ర కుదుపులను చూస్తున్నాయి. అలాంటి తరుణంలోనూ ఏడాది కాలంలో రాబడి సానుకూలంగా ఉండడం గమనార్హం. ఏడాది కాల పనితీరు విషయంలో ఈక్విటీ ఆధారిత హైబ్రిడ్ విభాగంలో ఈ పథకం రెండో స్థానంలో నిలిచింది. మూడేళ్ల కాలంలో ఈ పథకం ఏటా 14 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఇక ఐదేళ్లలో చూస్తే 21 శాతం, ఏడేళ్లలో 14 శాతం, 10 ఏళ్లలో 12.75 శాతం చొప్పున వార్షిక రాబడిని అందించింది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్ విభాగంతో పోల్చి చూస్తే అన్ని కాలాల్లోనూ ఈ పథకంలోనే రాబడి అధికంగా ఉండడాన్ని గమనించొచ్చు.

**పెట్టుబడుల విధానం**
ఈ పథకం అగ్రెస్సివ్ అలోకేషన్ విధానాన్ని అనుసరిస్తుంది. 75 శాతం వరకు ఈక్విటీలకు, 25 శాతం వరకు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. వివిధ మార్కెట్ క్యాప్‌ల మధ్య తగినంత వైవిధ్యాన్ని పాటిస్తుంది. అధిక వేల్యూషన్లకు చేరితే లాభాలు స్వీకరించి, అదే సమయంలో చౌక విలువల వద్ద అందుబాటులో ఉన్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగంగా గుర్తించొచ్చు.

ఇందుకు నిదర్శనం గత ఆరు నెలల్లో క్యాపిటల్ గూడ్స్, ఆటోల్లో అమ్మకాలు చేయగా, అదే సమయంలో టెక్నాలజీ, కెమికల్స్, ఫార్మా, హెల్త్‌కేర్‌లో ఎక్స్‌పోజర్ పెంచుకుంది. ఈ విధానంతో నష్టాలను పరిమితం చేసి లాభాలను పెంచుకునే వ్యూహాన్ని ఫండ్ నిర్వహణ బృందం అమలు చేసింది. ఈ తరహా విధానాలతో రిస్క్ తగ్గించి, రాబడులు పెంచుకునే విధంగా పథకం పనిచేస్తుంటుంది.

**పోర్ట్‌ఫోలియో**
ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.6,324 కోట్ల పెట్టుబడులున్నాయి. ఇందులో 73 శాతం వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 25 శాతం పెట్టుబడులు పెట్టగా, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలో 0.43 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. 1.64 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే 68 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 30 శాతం ఇన్వెస్ట్ చేస్తే, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 1.92 శాతం కేటాయించింది.

ఈక్విటీల్లో టెక్నాలజీరంగ కంపెనీల్లో అత్యధికంగా 18 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత 15 శాతం మేర బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ కంపెనీలకు, 9.68 శాతం మెటీరియల్స్ కంపెనీలకు, 8 శాతం హెల్త్‌కేర్ కంపెనీలకు కేటాయించింది. డెట్ పెట్టుబడుల్లో రిస్క్ దాదాపుగా లేని ఎస్‌వోవీల్లో (ప్రభుత్వ బాండ్లు) 20 శాతం ఇన్వెస్ట్ చేయగా, మెరుగైన క్రెడిట్ రేటింగ్‌కు నిదర్శనంగా ఉండే ఏఏఏ సెక్యూరిటీల్లో 3.41 శాతం పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు.

**టాప్ ఈక్విటీ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడులు శాతం |
|---|---|
| భారతీ ఎయిర్‌టెల్ | 4.49 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 3.89 |
| ఇన్ఫోసిస్ | 3.18 |
| ఫోర్టిస్ హెల్త్ | 2.90 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 2.88 |
| విప్రో | 2.74 |
| ఎన్‌టీపీసీ | 2.39 |
| పవర్‌ఫైనాన్స్ | 2.25 |
| ఒరాకిల్ ఫైనాన్స్ | 1.96 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 1.89 |

# RRRకు ఆస్కార్ రావడంతో చాలా భావోద్వేగం చెందాను: దీపికా పదుకొణె

బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె అస్కార్ అవార్డ్స్ -2025 గురించి మాట్లాడారా. ఈ ఏడాదిలో భారత్‌కు అవార్డ్స్ రాకపోవడంతో ఆమె విచారం వ్యక్తం చేశారు. పారిస్‌లో జరుగుతున్న లగ్జరీ ఫ్యాషన్ కంపెనీ లూయిస్ విట్టన్ షోలో ఆమె పాల్గొంటుండగా ఈ వ్యాఖ్యలు చేశారు. అందుకు సంబంధించిన ఒక వీడియోను తన సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఆస్కార్ అవార్డులు గెలుపొందే అన్ని అర్హతలు ఉన్న అనేక భారతీయ చిత్రాలు ఉన్నాయని దీపికా పదుకొణె చెప్పారు. భారతీయ అభిమానుల హృదయాలను గెలుచుకున్న 'ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ లైట్, మిస్సింగ్ లేడీస్' చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా అనేక వేదికల మీద ప్రశంసలు అందుకున్నాయి.

అయినప్పటికీ ఈ రెండు చిత్రాలు ఆస్కార్- 2025 తుది జాబితాలో చోటు దక్కలేదు. ఇలా చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్లను లాగేసుకుంటూనే ఉన్నారు. భారతదేశ సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ, ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు గుర్తింపు ఇవ్వడం లేదు. కారణం ఏంటో తెలియదు. కానీ, ఆస్కార్ మాత్రం మన సినిమాలను తిరస్కరిస్తుంది. అయితే, ఈ సంవత్సరం ఆస్కార్ అవార్డులలో ది బ్రూటలిస్ట్ చిత్రానికి గాను నటుడు అడ్రియన్ బ్రాడీకి ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డు రావడం నాకు సంతోషాన్ని ఇచ్చింది.

RRR అవార్డ్.. ఎంతో భావోద్వేగం చెందాను:దీపికా భారత్ నుంచి ఎన్నో విలువైన చిత్రాలు వచ్చినప్పటికీ అస్కార్ అవార్డ్ దక్కకపోవడం చాలా బాధాకరం అని చెప్పిన దీపికా పదుకొణె.. ఆర్ఆర్ఆర్ గురించి కూడా మాట్లాడారు. '2023 ఆస్కార్ అవార్డ్స్ నేను వ్యాఖ్యతగా ఉన్నాను. కానీ, ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ ప్రకటించిన సమయంలో నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. అప్పుడు చాలా భావోద్వేగానికి గురయ్యాను. అవి నాకు ఎంతగానో ప్రత్యేకమైన క్షణాలు. ఆ సినిమాలో నేను భాగం కాకపోయినప్పటికీ ఒక భారతీయురాలిగా ఆ విజయం నా సొంతం అనిపించింది. ఆ గొప్ప క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేను.'అని చెప్పారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో రామ్‌చరణ్,ఎన్టీఆర్ నటించారు. ఇందులో నాటు నాటు సాంగ్ ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్‌ను



# అందాల సిరి

'మా అందాల సిరి మీద పడనీకు ఏ కళ్లు... ఆ చిరునవ్వే పచ్చంగా ఉండాలి నూరేళ్లు... వేయాలి పరదాలు... చేయాలి సరదాలు... అమ్మా... నీ దీవెనలు తోడుంటే అంతే చాలు... మా ఊరి పొలిమేర దాటవుగా సంతోషాలు' అంటూ సాగుతుంది 'పరదా' సినిమా లోని 'మా అందాల సిరి' పాట. అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన 'పరదా' సినిమాలోని పాట ఇది.

'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో ఆనంద మీడియా పతాకంపై విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలోని 'మా అందాల సిరి...' పాట లిరికల్ వీడియోను ఆదివారం రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా, శ్రీకృష్ణ, రమ్య బెహరా పాడారు.





# హిట్-3 లవ్ ట్రాక్ సాంగ్.. మరోసారి సిద్ శ్రీరామ్ మ్యాజిక్

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' నుంచి లవ్ ట్రాక్ సాంగ్ విడుదలైంది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. యునానిమస్ ప్రోడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా మే 1న విడుదల కానుంది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రంలో అర్జున్ సర్కార్ పాత్రలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఆయన కనిపించనున్నారు.

హిట్ సినిమా నుంచి తాజాగా విడుదలైన సాంగ్‌ను సిద్ శ్రీరామ్, నూతన మోహన్ ఆలపించారు. లవ్ ట్రాక్ సాంగ్స్ పాడటంలో సిద్ శ్రీరామ్‌కు ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉందని అభిమానులు చెబుతుంటారు. ఇప్పుడు హిట్ మూవీలో 'ప్రేమ వెల్లువ' అనే సాంగ్ ప్రేక్షకులను మెప్పించేలా ఉంది. మిక్కీ జె. మేయర్ ఇచ్చిన మ్యూజిక్ కూడా బాగుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చాలా సాంగ్స్ భారీ హిట్ అయ్యాయి.



# ఇదేం 'బొమ్మరిల్లు' కాదు..'రక్తచరిత్ర' అంటూ సుహాస్ మూవీ టీజర్

టాలీవుడ్ హీరో సుహాస్ నటించిన కొత్త సినిమా 'ఓ భామ అయ్యో రామ' నుంచి టీజర్ వచ్చేసింది. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీని వీ ఆర్ట్స్ బ్యానర్‌పై హరీశ్ నల్ల నిర్మించారు. ఈ చిత్రానికి రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. సరికొత్త కథలతో ఆడియన్స్‌ను అలరిస్తోన్న సుహాస్ మరో కథతో ప్రేక్షకులను మెప్పించేలా టీజర్ ఉంది. ఈ మూవీకి రాధన్ సంగీతమందిస్తున్నారు. ఈ చిత్రంలో అనిత హాసానందని, అలీ, రవీందర్ విజయ్, బబ్లూ , ప్రభాస్ శ్రీను, రఘు కారుమంచి, మోయిన్, సాత్విక్ ఆనంద్, నాయని పావని కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# బ్రిటిష్ పాత్రలో...

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల యేటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నూతన దర్శకుడు కేపీ రోహిత్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

కాగా ఈ సినిమాలో బ్రిటిష్ అనే పాత్రలో శ్రీకాంత్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. రగ్డ్ హెయిర్, బ్లాక్ కోట్‌తో బ్రిటిష్ పాత్రలో శ్రీకాంత్ లుక్ వినూత్నంగా ఉంది. ఆదివారం (మార్చి 23) శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో 'సంబరాల ఏటి గట్టు' చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది.





## ఐపీఎల్ హిస్టరీలోనే కాస్ట్‌లీ ప్లేయర్.. కట్ చేస్తే! తొలి మ్యాచ్‌లోనే డకౌట్

**ఐపీఎల్-2025ను లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ పేలవంగా ఆరంభించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ఖరీదైన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్.. తొలి మ్యాచ్‌లోనే తీవ్ర నిరాశపరిచాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా వైజాగ్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో పంత్ డకౌటయ్యాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. ఆరు బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు.**

కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఫాఫ్ డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో పంత్‌ను నెటిజన్లు ట్రోలు చేస్తున్నారు. ఈ మాత్రం ఆటకేనా రూ. 27 కోట్లు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. కాగా గతేడాది జరిగిన మెగా వేలంలో రూ. 27 కోట్ల భారీ ధరకు పంత్‌ను లక్నో కొనుగోలు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో పంత్ విఫలమైనప్పటికి మిగితా బ్యాటర్లు మాత్రం విధ్వంసం సృష్టించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది.

లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్( 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 72), నికోలస్ పూరన్( 30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 75 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఓ దశలో ఈజీగా 250 పైగా లక్నో స్కోర్ దాటుతుందని భావించారు. కానీ 15 ఓవర్ల తర్వాత ఢిల్లీ బౌలర్లు కమ్‌బ్యాక్ ఇచ్చారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు సాధించగా.. విప్రాజ్ నిగమ్, ముఖేష్ కుమార్ తలా వికెట్ సాధించారు.



## గుడ్‌న్యూస్ చెప్పిన కేఎల్ రాహుల్.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన అతియా శెట్టి..

**IPL 2025 మొదటి మ్యాచ్ ఆడటానికి ముందే కేఎల్ రాహుల్ తన జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌ను విడిచిపెట్టి ముంబైకి తిరిగి వచ్చాడు. అక్కడ అతని భార్య అతియా శెట్టి ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ సందర్భంగా రాహుల్ తన కూతురు పుట్టిన వార్తను పంచుకున్నాడు.**

**గుడ్‌న్యూస్ చెప్పిన కేఎల్ రాహుల్.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన అతియా శెట్టి..**

ఐపీఎల్ 2025 ప్రారంభం ఢిల్లీ క్యాపిటల్స్ , టీం ఇండియా స్టార్ వికెట్ కీపర్‌బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌కు శుభవార్త తెచ్చిపెట్టింది. రాహుల్, అతని భార్య అతియా శెట్టి ఇంట్లోకి కొత్త సభ్యుడు ప్రవేశించాడు. రాహుల్ భార్య అతియా శెట్టి మార్చి 24, సోమవారం నాడు తమ కుమార్తెకు జన్మనిచ్చింది. రాహుల్, అతియా మొదటిసారి తల్లిదండ్రులు అయిన ఆనందాన్ని పొందారు. రాహుల్, అతియా తమ కుమార్తె పుట్టిన శుభవార్తను సోషల్ మీడియా పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

టీం ఇండియా స్టార్ బ్యాట్స్‌మన్ కెఎల్ రాహుల్ ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున తన తొలి మ్యాచ్ ఆడాల్సి ఉంది. కానీ, దానికి ఒక రోజు ముందే ఇంటికి తిరిగి వచ్చాడు. తన భార్య అతియా ఎప్పుడైనా బిడ్డకు జన్మనివ్వవచ్చని రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యానికి చెప్పడంతో.. ఈ ప్రత్యేక సందర్భంగా కుటుంబంతో కలిసి ఉండటానికి ఫ్రాంచైజీ రాహుల్‌ను అనుమతించిందంట.మార్చి 24, సోమవారం, ఢిల్లీ క్యాపిటల్స్ తమ మొదటి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడుతున్నప్పుడు, రాహుల్, అతియా తమ కుమార్తె పుట్టిన వార్తను ఫోటోతో పంచుకున్నారు. అయితే, రాహుల్, అతియా తమ కుమార్తె పేరును ఇంకా వెల్లడించలేదు. అభిమానులతో పాటు, క్రికెట్, సినీ ప్రపంచానికి చెందిన ప్రముఖ తారలు కూడా ఈ పోస్ట్‌పై వారిద్దరినీ అభినందించారు. కాగా, రాహుల్, అతియా 2023 లో వివాహం చేసుకున్నారు. కొన్ని నెలల క్రితమే వారు తల్లిదండ్రులు కాబోతున్నారని వెల్లడించారు.మరిన్ని క్రీడా వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి.

## మైదానంలో తమీమ్ ఇక్బాల్‌కు గుండెపోటు.. పరిస్థితి విషమం..

**బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ గుండెపోటుకు గురయ్యాడు. ప్రస్తుతం అతనికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.**

**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో అతడికి గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తమీమ్ పరిస్థితి క్లిష్టంగానే ఉందని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేబాశీష్ చౌధురి వెల్లడించారు. తమీమ్‌కు యాంజియోప్లాస్టీ చేసినట్లు వైద్యులు చెప్పారు. 'తమీమ్ ప్రాణాపాయ స్థితి నుంచి బయటికి వచ్చాడు. అతనికి గుండెపోటు వచ్చింది. మేము యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ చేశాం. ప్రస్తుతం అతను అబ్జర్వేషన్‌లో ఉన్నాడు. తమీమ్ వేగంగా కోలుకునేందుకు వైద్య బృందం కృషిచేస్తోంది' అని వైద్యులు ఒక ప్రకటనలో తెలిపారు.ఢాకా ప్రీమియర్ లీగ్‌లో భాగంగా సోమవారం మహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్, షినెపుకర్ క్రికెట్ క్లబ్‌ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మహమ్మదన్ క్లబ్ కెప్టెన్‌గా ఉన్న తమీమ్ టాస్ కోసం మైదానంలోకి వచ్చాడు. మరికాసేపట్లో మ్యాచ్ ప్రారంభం అవుతుందనగా.. అతడు ఉన్నట్టుండి ఛాతీలో నొప్పితో బాధపడ్డాడు. దీంతో స్థానికంగా ఉన్న ఫజిలాతున్నెసా ఆసుపత్రికి తరలించి పరీక్షించగా.. స్వల్ప గుండెపోటుగా గుర్తించారు.అతడిని ఢాకా తరలించేందుకు హెలికాప్టర్ ఏర్పాటుచేశారు. కానీ, హెలిప్యాడ్‌కు వెళ్తుండగా మరోసారి గుండెపోటు రావడంతో తిరిగి అదే ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారని దేబాశీష్ వెల్లడించారు. తమీమ్ ఆరోగ్యంపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఆరా తీశారు.ఈ ఏడాది జనవరిలోనే తమీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నుంచి లీగ్ మ్యాచ్‌లు ఆడుతూ అప్పుడప్పుడు కామెంట్రీ చేస్తున్నాడు. చివరిసారిగా 2023లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు.. బంగ్లా తరపున 70 టెస్టులు, 78 టీ20లు ఆడాడు. 243 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లు ఆడి 8,357 పరుగులు నమోదు చేశాడు. తమీమ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### మలప్పురం మణికట్టు మాంత్రికుడు విఘ్నేశ్..

# మరో కుల్‌దీప్ అవుతాడా?

**ఆటగాడి సత్తా ఏంటో ఒక్క మ్యాచ్‌లోనే తెలిసిపోతుంది. అతడికి అండగా నిలిస్తే అద్భుతాలు చేసి చూపిస్తాడు. ఇలాంటి అవకాశమే కేరళకు చెందిన ఓ యువ క్రికెటర్‌కు దక్కింది.**



ఐపీఎల్.. యువ క్రికెటర్లకు అద్భుతమైన వేదిక అని మరోసారి రుజువైంది. టీమ్‌ఇండియాకు ఆడుతోన్న చాలామంది కుర్రాళ్లు ఈ లీగ్‌లోనే మెరిసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించారు. ఈ జాబితాలోకి మరో యువ స్పిన్నర్ విఘ్నేశ్ పుతుర్ చేరాడు. తొలిసారి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ఈ కుర్రాడు నాణ్యమైన ప్రదర్శనతో దిగ్గజం ఎంఎస్ ధోనీ నుంచి మెప్పు పొందడం విశేషం. ముంబయి తరఫున బరిలోకి దిగిన విఘ్నేశ్ నాలుగు ఓవర్ల కోటాలో 32 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. స్పిన్ బౌలింగ్‌ను దంచేసే దీపక్ హుడా, శివమ్ దూబెను ఔట్ చేశాడు. దూకుడుగా ఆడిన రుతురాజ్‌ను కూడా పెవిలియన్‌కు పంపాడు. రోహిత్‌కు బదులు ఇంపాక్ట్‌గా వచ్చి సత్తా చాటాడు. మరి ఇలాంటి ప్రదర్శన చేసిన విఘ్నేశ్ చిన్నప్పటినుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరాడంటే అద్భుతమనే చెప్పాలి.

**తండ్రి ఆటో డ్రైవర్..**

24 ఏళ్ల విఘ్నేశ్ కేరళ తరఫున సీనియర్ క్రికెట్ ఆడుతున్నాడు. అతడి తండ్రి సునీల్ కుమార్ ఓ ఆటో డ్రైవర్. విఘ్నేశ్ తల్లి బిందు.. గృహిణి. ఆర్థికంగా కష్టాలు ఉన్నా సరే అతడి ఇష్టాలను మాత్రం కాదనకుండా పెంచారు. క్రికెట్ ప్రయాణం కొనసాగించడంలో వీరి పాత్రే కీలకం. మలప్పురంలో పుట్టిన విఘ్నేశ్ క్రికెట్ పాఠాలను నేర్చుకొనేందుకు త్రిస్సూర్‌కు మారిపోయాడు. కళాశాల స్థాయిలో అతడు మీడియం పేసర్‌గా మొదలుపెట్టిన అతడు తర్వాత స్పిన్నర్‌గా మారాడు. మాస్టర్ ఆఫ్ లిటరేచర్ చేసిన సెయింట్ థామస్ కాలేజీ తరఫున అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. దీంతో కేరళ క్రికెట్ లీగ్ తొలి సీజన్‌లో అలెప్పీ రిపిల్స్ జట్టుకు ఆడే అవకాశం దక్కింది. ఆ తర్వాత తమిళనాడు ప్రీమియర్‌లీగ్‌లోనూ అడుగుపెట్టాడు. కేరళ తరఫున అండర్23 క్రికెట్ ఆడాడు.

**మరో కుల్‌దీప్ అవుతాడా?**

కేసీఎల్ సమయంలో ముంబయి ఇండియన్స్ అతడిలోని ప్రతిభను గుర్తించింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.30 లక్షలకు సొంతం చేసుకుంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందు అతడిని SA20 లీగ్‌కు పంపించింది. అక్కడ ముంబయి కేప్‌టౌన్ జట్టు నెట్‌బౌలర్‌గా సేవలందించాడు. రషీద్‌ఖాన్ వంటి టాప్ స్పిన్నర్‌తో ట్రైనింగ్ అయ్యే అవకాశం విఘ్నేశ్‌కు దక్కింది. అతడిని చూస్తుంటే మరో కుల్‌దీప్ యాదవ్‌లా అవుతాడని ప్రముఖ కామెంటేటర్ హర్షాభోగ్లే వ్యాఖ్యానించాడు. చెన్నైతో మ్యాచ్‌లోనూ 70 కి.మీ. వేగంతో ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ సంధించే ఫ్లైటెడ్ డెలివరీలను ఆడటంలో బ్యాటర్లకు ఇబ్బంది తప్పలేదు. కుల్‌దీప్‌లా స్లో టర్న్ బంతులను వేయడంలో విఘ్నేశ్ కూడా నేర్పరే అనేది క్రికెట్ విశ్లేషకుల మాట. మణికట్టుతో అద్భుతాలు కుల్‌దీప్‌ను రిప్లేస్ చేయదగ్గ నైపుణ్యం విఘ్నేశ్‌లో ఉంది.

**ధోనీ నుంచి ప్రశంసలు..**

ఒక దశలో ముంబయితో మ్యాచ్‌ను సులువుగా సీఎస్కే సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. లక్ష్యం కూడా 160 లోపే కావడమే దీనికి కారణం. రచిన్ (65*), రుతురాజ్ (53) హాఫ్ సెంచరీలు చేశారు. అంతా సాఫీగా సాగిపోతున్నవేళ.. విఘ్నేశ్ బౌలింగ్‌తో ముంబయి చివరివరకూ పోరాడేలా చేశాడు. దీంతో యువ క్రికెటర్ ప్రదర్శనను చూసిన ధోనీ మ్యాచ్ చివర్లో ప్రత్యేకంగా అభినందించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాలనుకొనే కుర్రాడికి ఇంతకుమించిన గొప్ప జ్ఞాపకం ఇంకేం ఉంటుంది. ఇలాగే కొనసాగితే తప్పకుండా జాతీయ జట్టులోకి వచ్చే అవకాశం లేకపోలేదు.

## ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్.. కట్ చేస్తే! ఆ జట్టు కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్



**పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025 సీజన్‌లో కరాచీ కింగ్స్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కరాచీ కింగ్స్ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.**

**పీఎస్ఎల్‌లో డేవిడ్ వార్నర్ యాక్షన్ కోసం మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము.**

కెప్టెన్ సాబ్ మీరు సిద్ధంగా ఉన్నారా? అని కరాచీ కింగ్స్ ఎక్స్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసింది. పాకిస్తాన్ సూపర్ లీగ్ డేవిడ్ భాయ్ ఆడటం ఇదే తొలిసారి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 మెగా వేలంలో అమ్ముడుపోకపోవడంతో వార్నర్ తన పేరును పీఎస్ఎల్ డ్రాఫ్ట్‌లో నమోదు చేసుకున్నాడు. దీంతో జనవరిలో జరిగిన పీఎస్ఎల్ వేలంలో 300,000 డాలర్లు (రూ. 2.56 కోట్లు)కు వార్నర్‌ను కరాచీ కింగ్స్ కొనుగోలు చేసింది.

**మసూద్‌పై వేటు..**

గత సీజన్ వరకు తమ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన షాన్ మసూద్‌పై కరాచీ కింగ్స్ వేటు వేసింది. అతడి స్థానంలో డేవిడ్ వార్నర్‌కు తమ జట్టు పగ్గాలను కరాచీ అప్పగించింది. కాగా గతేడాదిలో జూన్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయినప్పటి నుండి, వార్నర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడుతున్నాడు.

ఈ క్రమంలో ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోకపోవడంతో పాకిస్తాన్‌లో ఆడాలని ర్ణయించుకున్నాడు. పీఎస్ఎల్ డ్రాఫ్ట్‌లో ప్లాటినం విభాగంలో అతడిని కేకే ఫ్రాంచైజీ దక్కించుకుంది. కరాచీ జట్టులో ఆడమ్ మిల్నే, జేమ్స్ విన్స్,టిమ్ సీఫెర్ట్ వంటి విదేశీ స్టార్లు ఉన్నారు. ఇక పీఎస్ఎల్ 2025 సీజన్ ఏప్రిల్ 11 నుంచి ప్రారంభం కానుంది.

కరాచీ కింగ్స్ జట్టు: అబ్బాస్ అఫ్రిది, ఆడమ్ మిల్నే, డేవిడ్ వార్నర్, హసన్ అలీ, జేమ్స్ విన్స్, ఖుష్దిల్ షా, ఇర్ఫాన్ ఖాన్ నియాజీ, షాన్ మసూద్, అమీర్ జమాల్, అరాఫత్ మిన్హాస్, టిమ్ సీఫెర్ట్, జాహిద్ మహమూద్, లిట్టన్ దాస్, మీర్ హమ్జా, కేన్ విలియమ్సన్, ఇమ్మాద్ మమ్‌జామ్, ఎమ్బియామ్‌సన్ యూసుఫ్, ఫవాద్ అలీ, రియాజుల్లా

## ఆడు మగాడ్రా బుజ్జీ.. ఒంటి చేత్తో ఢిల్లీని గెలిపించిన అశుతోశ్ శర్మ



**ఉత్కంఠ భరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అశుతోశ్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతాన్ని చేసి చూపించాడు. గెలిచే ఆశలు లేని చోట తన అద్భుత పోరాటంతో విజయాన్ని సాధించాడు.**

ఉత్కంఠ భరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అశుతోశ్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతాన్ని చేసి చూపించాడు. గెలిచే ఆశలు లేని చోట తన అద్భుత పోరాటంతో విజయాన్ని సాధించాడు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ తేడాతో విజయాన్ని అందుకుంది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19.3 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 211 పరుగులు చేసి గెలుపొందింది. చివరి ఓవర్లో 6 పరుగులు అవసరం కాగా.. 3వ బంతిని సిక్సర్ బాదిన అశుతోశ్ ఢిల్లీకి అద్భుత విజయాన్ని సాధించి పెట్టాడు. నిగమ్ (15 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), స్టబ్స్ (22 బంతుల్లో 34; 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో శార్దుల్ ఠాకూర్, సిద్ధార్థ్, రాఠి, రవి బిష్ణోయ్ లు తలా రెండేసి వికెట్లు సాధించారు.

వారెవ్వా అశుతోశ్

19వ ఓవర్ 3వ బంతికి ఢిల్లీ క్యాపిటల్స్ 9వ వికెట్ ను కోల్పోయింది. ఈ దశలో ఢిల్లీ గెలవాలంటే 9 బంతుల్లో 18 పరుగులు చేయాల్సి ఉంది. చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అయితే ఇక్కడే అద్భుతం జరిగింది. అప్పటి వరకు చూసి ఆడుతున్న అశుతోశ్ శర్మ.. ఒక్కసారిగా బీస్ట్ మోడ్ లోకి వెళ్లిపోయాడు. 19వ ఓవర్ చివరి మూడు బంతులను వరుసగా 2, 6, 4 బాదాడు. దాంతో ఢిల్లీ విజయ సమీకరణం 6 బంతులకు 6 పరుగులకు చేరుకుంది. అయితే ఓవర్ పూర్తవ్వడంతో అశుతోశ్ శర్మ నాన్ స్ట్రయికింగ్ ఎండ్ కు పరిమితం అయ్యాడు. ఇక చివరి ఓవర్ ను లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ షాబాజ్ కు ఇచ్చాడు. స్ట్రయికింగ్ ఎండ్ లో ఉన్న మోహిత్ శర్మ తొలి బంతిని ఆడే ప్రయత్నం చేయగా.. బంతి ప్యాడ్లను తాకుతూ వెళ్లిపోయింది. రిషభ్ పంత్ ఎల్బీ కోసం అప్పీల్ చేయగా.. అంపైర్ తిరస్కరించాడు. వెంటనే రిషభ్ పంత్ రివ్యూ తీసుకున్నాడు. రివ్యూలో నాటౌట్ అని తేలింది. ఆ తర్వాతి బంతికి మోహిత్ శర్మ సింగిల్ తీశాడు. ఇక 20వ ఓవర్ 3వ బంతిని సిక్సర్ బాదిన అశుతోశ్ ఢిల్లీ క్యాపిటల్స్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.